

పన్నులు చెల్లిస్తే 5 శాతం రాయితీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇంటిపన్ను, ఖాళీ స్థలాల పన్నులను ఏకమొత్తంలో చెల్లిస్తే 5శాతం రాయితీ సౌకర్యాన్ని ప్రభుత్వం ప్రకటించిందని కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీలోగా చెల్లించిన వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివద్ధికి సహకరించాలని కోరారు. పురమిత్ర ఫోన్ నెంబర్ 939011 3399 అనే నెంబరును తమ మొబైల్ ఫోన్లో నిక్షిప్తం చేసుకుని తద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు చేసుకోవచ్చని తెలిపారు.

1500 ఎకరాలకు అందని సాగునీరు

- సిపిఎం చొరవతో కదిలిన అధికార యంత్రాంగం
- రైతులు ఒత్తిడి పెంచితేనే పరిష్కార మార్గం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / తెర్లాం

జిల్లాలోని తెర్లాం మండలంలోని ఐదు గ్రామాల పరిధిలో 1500 ఎకరాలకు సాగునీరు అందక అవస్థలు పడుతున్నారు. ఒకప్పుడు పచ్చని పైరుతో కళకళలాడే ఈ ప్రాంతం నేడు బీడువారుతోంది. కనీసం వర్షాకాలంలోనైనా నీటితో తొణికిసలాడే చెరువులు కూడా వెలవెలబోతున్నాయి. వరుణుడు కరుణిస్తే తప్ప మొక్క మొలవని పరిస్థితి కూడా దాపురిస్తోంది. సుమారు 19ఏళ్ల క్రితం ఉత్పన్నమైన ఈ సమస్యను పాలకులు పట్టించుకోలేదంటే అతిశయోక్తి కాదు. ఇటీవల సిపిఎం చేపట్టిన ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ఈ ప్రాంత రైతులు తమ సమస్యను మరోసారి నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. తెలుసుకున్నదే తడువుగా ఆ పార్టీ నాయకులు అన్ని స్థాయిల్లోనూ ఆందోళనలు చేయడంతో పాటు తహశీల్దార్, ఆర్‌డిఒతోపాటు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన దృష్టికి కూడా తీసుకెళ్లడంతో వారంతా స్పందించారు.

తెర్లాం మండలం సింగిరెడ్డివలస ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపునీరుతో అదే గ్రామ పరిధిలోని కామన్న చెరువు నిండేది. అక్కడి నుంచి సతివాడ పరిధిలోని లింగయ్యపాలెం చెరువుకు మిగిలిన దిక్కుల నుంచి కూడా నీరు చేరేది. ఇది కాస్త ఎక్కువ విస్తీర్ణంలో ఉండడంతో సింగిరెడ్డివలసతో పాటు సతివాడ, బూరిపేట, నెమలాం, గొలుగాం గ్రామాల పరిధిలోని మరో ఐదు చెరువులకు మదుములు, కాలువల ద్వారా వెళ్లేది. వీటి పరిధిలోని సుమారు 1500 ఎకరాల్లో వరి, చెరకు, జొన్నలు, నువ్వుల పంటలు పండేవి. తోటపల్లి కుడికాలువ నిర్మాణంలో భాగంగా కామన్నచెరువు విస్తీర్ణం తగ్గిపోయింది. పైనుంచి వచ్చే ఊటకాలువలు, వర్షపునీటి కాలువలు తోటపల్లి కాలువలో కలిసిపోయాయి. దీంతో, దానికి కింది భాగంగంలోవున్న లింగయ్యచెరకు మూలాలు దెబ్బతిన్నాయి. గతంలో చినుకుపడితే నిండిపోయే ఈ చెరువు ప్రస్తుతం వరదలు వచ్చినా బొటాబొటి నీటితోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీరంతా కాలువలోకి పోతోంది. కాలువ లోతట్టుగా ఉండడంతో స్థానికంగావున్న భూములకు అందే పరిస్థితి లేదు. దీంతో, ఈ చెరువుకు దిగువ ప్రాంతంలోవున్న ఆయా గ్రామాల పరిధిలోని సుమారు 4వేల రైతు కుటుంబాలవారు సాగునీటి సదుపాయాన్ని కోల్పోయారు. తోటపల్లి కాలువ నిర్మాణం జరుగుతున్నప్పుడు నాటి పాలకులకు అవగాహన లేకపోవడం, పట్టించుకోక పోవడమే ఇందుకు కారణం అని రైతులు చెబుతున్నారు. గతంలో ఈ ప్రాంత రైతులు ఎన్నో సార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదు. ఇటీవల సిపిఎం చేపట్టిన ప్రజాచైతన్య యాత్రలో భాగంగా నాయకులు ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా దాదాపు అన్ని గ్రామాల్లోని రైతులూ ఇదే సమస్యపై స్పందించారు. దీంతో, సిపిఎం ఆధ్వర్యాన గత నెలలోనే రైతులు ఆందోళన చేపట్టారు. అధికారులకు వినతిపత్రాలు కూడా సమర్పించడంతో స్థానిక తహశీల్దార్, తోటపల్లి ప్రాజెక్టు ఎఇ, ఇరిగేషన్ ఎఇలు క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని కూడా చెప్పారు. ఆలోపు అసంబ్లీ నుంచి తిరిగొచ్చిన స్థానిక ఎమ్మెల్యే బేబీ నాయన కూడా ఈనెల 2వ తేదీన సతివాడ, సింగిరెడ్డివలస పరిసర ప్రాంతంలోవున్న సమస్యను నేరుగా పరిశీలించారు. ఈ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని కూడా హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారం చేయకపోతే మిగిలిన రైతులను ఐక్యం చేసి, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని బయటపెడతామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొట్నూరు శంకరరావు హెచ్చరిస్తున్నారు. కేవలం రూ.5లక్షలు ఖర్చుచేస్తే 5గ్రామాల పరిధిలోని 1500 ఎకరాలకు సాగునీరు అందుతుందని, సుమారు 4వేల ఎకరాలకు మేలు జరుగుతుందని చెబుతున్నారు. మరోవైపు రైతు సంఘం నాయకులు కూడా రైతుల వెన్నంటి ఉంటూ సమస్య పరిష్కారానికి అధికారులపై ఒత్తిడి పెంచుతోంది.



ప్రజా చైతన్యయాత్రలో భాగంగా చెరువును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు (ఫైల్)



రైతుల ఆందోళనతోపంట పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన (ఫైల్)



మసీదు వద్ద ముస్లిములనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు పి.శంకర్రావు

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుపై నిరసన తెలపండి

ప్రజాశక్తి-బొబ్బిలి

వక్ఫ్‌బోర్డులో సవరణలు లౌకిక, రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని, ప్రజలంతా ఈ బిల్లును వ్యతిరేకించాలని సిపిఎం నాయకులు పి.శంకర్రావు అన్నారు. హిందుత్వ మతోన్మాద ఎజెండా అమల్లో భాగంగా బిజెపి కేంద్ర ప్రభుత్వం ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతూ అనేక దాడులు చేస్తుందని, సరికొత్తగా వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింలు ధార్మిక సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టిందని అన్నారు. వక్ఫ్‌బోర్డు బిల్లును కేంద్రం ఆమోదించిన నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని మసీదు వద్ద ముస్లిములకు అవగాహన కల్పించారు. బిజెపి సవరించిన ఈ చట్టం ఆస్తుల కబ్జా చేయడానికి తప్ప వక్ఫ్ ఆస్తుల అభివృద్ధికి కాదని చెప్పారు. దుర్మార్గమైన సవరణలు చేస్తూ ముస్లిం ప్రజల ఆస్తులపై యుద్ధం ప్రకటించే ఈ బిల్లును లౌకిక పార్టీలుగా చెప్పుకునే టిడిపి, జనసేనతో సహా మరికొన్ని పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కై బలపరచడంతో ఈ బిల్లు ఆమోదం పొందిందన్నారు. టిడిపి జనసేన వైఖరి లౌకిక తత్వానికి విఘాతం కలిగించాయని, సిపిఎం సహా ప్రతిపక్షాలు ఈ బిల్లును పార్లమెంట్‌లో వ్యతిరేకించాయని తెలిపారు. ఒకసారి వక్ఫ్ చేయబడిన ఆస్తులు శాశ్వతంగా వక్ఫ్ ఆస్తులుగా ఉంటాయని వాటి స్వభావాన్ని మార్చే అధికారం ఎవరికీ లేదని సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఈ చట్టం చేశారన్నారు. దీన్ని తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు.

విజయనగరం టౌన్ : వక్ఫ్‌బోర్డు బిల్లును కేంద్రం ఆమోదించిన నేపథ్యంలో మూడు లాంతర్లు మసీదు వద్ద ముస్లిములకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ ఖాదర్ బాద్షా, పెద్దలు అన్సార్ మాట్లాడుతూ సిపిఎం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని అభినందిస్తున్నామని, ఇప్పటికే వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఈ సవరణలతో మరింత నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 1961 లో ఉత్తరాంధ్ర జిల్లాలో వక్ఫ్ బోర్డు ఆస్తులపై ప్రాపర్టీ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారని, ఆ సర్వేలో పేర్కొన్న విధంగా చూస్తే విజయనగరం జమ్మ నారాయణపురం షేక్ షాహిద్ బాబా ఖిల్లా సర్వే నంబర్ 142 / 10 లో 92 సెంట్లు మెట్ట భూమి కనుమరుగైందని, కంటోన్మెంట్ తెలకల వీధిలో ఉన్న స్థలం, మస్తాన్ వీధిలో చెరువు, బరేల్ గ్రౌండ్ భూములు ఇప్పుడు వక్ఫ్ బోర్డు లో కనిపించడం లేదని తెలిపారు. అప్పటి పెద్దలు వక్ఫ్ బోర్డుకిచ్చిన ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వ పెద్దలు ఆధారాలు లేవని ఆక్రమణ దారులకే విడిచి పెడుతున్నారని , వక్ఫ్ బోర్డు కి బిజెపి ప్రభుత్వం చేసిన సవరణలతో మరింత ప్రమాదం పొంచి ఉందని అన్నారు. సిపిఎం పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు.



అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాంతారావు

ప్రజాపంపిణీ వ్యవస్థ తీరు బాగోలేదు

రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు కాంతారావు
అంగన్వాడీ కేంద్రాల పనితీరు భేష్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జాతీయ ఉత్పత్తి ప్రజా పంపిణీ పథకం చౌక ధరల దుకాణాలు తెరవడంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని జాతీయ ఆహార భద్రత కమిషన్ సభ్యులు కాంతారావు అన్నారు. శుక్రవారం ఆయన నగరంలో పర్యటించారు. చౌక ధరల దుకాణాలను తనిఖీ చేయగా 11వ నెంబరు రేషన్ డిపో లో సరుకుల వ్యత్యాసం ఉండడం, సకాలంలో తెరవకపోవడంతో సిఎస్‌డిటిపై మండిపడ్డారు 14వ నెంబరు రేషన్ డిపోలో ఆక్సిజన్ సిలిండర్లు ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరెండు డిపోలపై చర్యలు తీసుకోవాలని డిఎస్ఒ మధుసూదనరావుకు ఆదేశించారు. డక్కినవీధి, బుచ్చన్న కోనేరు,అరకాల గడ్డ , నాగాశపు వీధి, హుకుంపేట అంగన్వాడీ కేంద్రాలు సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పిల్లలతో ముచ్చటించి సంతృప్తి వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూలును సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పర్యటనలో డిఎస్ఒ మధుసూదన్ రావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి రుక్సనా సుల్తాన్ బేగం, ఐసిడిఎస్ పిఒ ప్రసన్న, సిఎస్‌డిటి రామారావు, ఎంఇఒలు రామచంద్రరావు, సత్యవతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇళ్ల నిర్మాణాలు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు అన్ని అనుమతులు తప్పనిసరి నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. భవనాలకు నివేశిన ధ్రువీకరణ పత్రం అందజేసే నిమిత్తం ముందస్తు పరిశీలన ప్రక్రియలను చేపట్టారు. ప్రణాళిక విభాగం సిబ్బందితో భవనానికి ఉన్న సెట్‌బ్యాక్స్, ఇతర కొలతలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అన్ని సజావుగా ఉండడంతో నివేశిత ధ్రువీకరణ పత్రాన్ని అందజేసేందుకు అర్హత ఉన్నట్లు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎట్టి నిర్మాణాలను సహించబోమని స్పష్టం చేశారు. టిపిఎస్ అనిత, ప్రణాళికా కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయగనరంకోట

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్‌డే నిర్వహించారు. సిబ్బంది నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు.

8, 9 తేదీల్లో జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 8, 9 తేదీల్లో పురుషుల అండర్ - 19, 23 విభాగాల్లో జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి. సీతారామరా తెలిపారు. బాబా మెట్ట, సర్ విజ్జి క్రికెట్ మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 8న నిర్వహించే అండర్ - 19 జట్టు ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2006 సెప్టెంబర్ 1 తరువాత, 9న నిర్వహించే అండర్ - 23 విభాగంలో 2002 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. క్రీడాకారులు వైట్‌డ్రెస్, సొంత క్రికెట్ కిట్ తో పాటు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తీసుకుని ఉదయం 7.30 గంటలకు హాజరుకావాలన్నారు.

మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్రంలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి ముల్యంకనా కేంద్రాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు శుక్రవారం సందర్శించారు. మూల్యాంకనం జరుగుతున్న తీరు, కేంద్రంలో లభిస్తున్న సౌకర్యాలు గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకన్నారు. సొంత భవనంలో ముల్యాంకనం కేంద్రం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. తన విజయానికి సహకరించిన ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ కతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట పిఆర్‌టియు నాయకు డి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బంకపల్లి శివ ప్రసాద్, రావాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కె.వెంకట నర్సింగరావు
విజయనగరం



పివివి గోపాలరాజు
గజపతినగరం



పి.కృష్ణవేణి
రాజాం

మూడు ఎఎంసిలకు ఛైర్మన్ల నియామకం

ప్రజాశక్తి-గజపతినగరం, రేగిడి, విజయనగరం కోట

రాష్ట్ర వ్యాప్తంగా 38 వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అందులో భాగంగా జిల్లాలోని గజపతినగరం, విజయనగరం, రాజాం మార్కెట్ కమిటీ ఛైర్మన్లను ప్రకటించింది. విజయనగరం ఎఎంసి ఛైర్మన్‌గా కర్రోతు వెంకట నర్సింగరావు, గజపతినగరం ఎఎంసి ఛైర్మన్ పివివి గోపాలరాజు, రాజాం ఎఎంసి ఛైర్మన్‌గా జనసేన నాయకురాలు పొగిరి కృష్ణవేణి నియమితులయ్యారు. ప్రధానంగా విజయనగరం ఎఎంసి ఛైర్మన్‌గా నియమితులైన నర్సింగరావు సుదీర్ఘకాలంగా పార్టీలో పనిచేస్తున్నారు. తెలుగు యువత అధ్యక్షుడిగా సేవలందించారు. టిడిపి నగర అధ్యక్షుడిగా 2022 నుంచి 2023 వరకు పనిచేశారు. ప్రభుత్వం గత ఎన్నికలముందు మాడుగుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలనుసైతం అప్పగించింది. ఆయన సతీమణి కర్రోతు రాధామణి 49వ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్నారు. ఐవిఆర్ సర్వే ద్వారా పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయాలుసేకరించిన అధిష్టానం నర్సింగరావును నియమించింది.

గజపతినగరం ఎఎంసి ఛైర్మన్‌గా నియమితులైన గోపాలరాజు పార్టీలో ముఖ్య నాయకుడిగా ఉన్నారు. గతంలో బిజెపి నుంచి టిడిపిలో చేరిన ఆయన నిబద్ధతో పనిచేసే వ్యక్తిగా పేరుంది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇచ్చిన హామీ మేరకు ఆయన పదవి లభించింది.

రాజాం ఎఎంసి ఛైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన పొగిరి కృష్ణవేణి నియమితులయ్యారు. ఆమె నియామకంతో నియమించడం పట్ల నాలుగు మండలాల ఆశావాహులు నిరాశ చెందారు. అనుకోకుండా జనసేన పార్టీకి ఎఎంసి పదవి దక్కడం పట్ల ఆ పార్టీ నాయకుల్లో సంతోషం వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకున్న వారికి గుర్తింపు లభించిందని కృష్ణవేణి తెలిపారు. రైతులకు సేవ చేసే అవకాశం కలిగిందని అన్నారు.

పండ్లను కృత్రిమంగా పండిస్తే కేసు : జెసి

ప్రజాశక్తి-విజయనగరం



రసాయనిక పదార్థాలు వినియోగించి పళ్లను కృత్రిమంగా పండించి విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ చెప్పారు. టాస్క్ ఫోర్స్ మొదటి సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబరులో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండ్లను కృత్రిమంగా పండించడం వల్ల పండ్ల నాణ్యత దెబ్బతినడంతో పాటు ఇటువంటి పండ్లను తినడంవల్ల ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని, ఈతరహా పద్ధతులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కృత్రిమంగా రసాయనాలను వినియోగించి పండించిన పండ్లను తినడం వల్ల పెప్టిక్ అల్సర్‌లు, తలనొప్పి, మైకం, ఇతర న్యూరోలాజికల్ సమస్యలు ఏర్పడే అవకాశం వుందని, అందువల్ల ఈతరహా పళ్లను మార్కెట్‌లో విక్రయించకుండా జిల్లా అధికారులతో ఒక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. విస్తతంగా పండ్ల దుకాణాలు, నిల్వ ప్రదేశాలను తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ టాస్క్ ఫోర్స్‌లో కన్వీనర్‌గా జిల్లా సహాయ ఫుడ్ కంట్రోలర్ వుంటారని, జిల్లా ఉద్యాన అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్, మార్కెటింగ్ శాఖ ఎడి సభ్యులుగా వుంటారని తెలిపారు. రానున్న వేసవిలో డిమాండ్‌ను తీర్చడానికి మామిడి పండ్లను తరచుగా కృత్రిమంగా పండిస్తారని, దీనిపై ఆహార కల్తీ నిరోధక అధికారులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఆహార కల్తీ నియంత్రణ శాఖ సహాయ కంట్రోలర్ ఎస్.ఈశ్వరి, డిపిఒ వెంకటేశ్వరరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, ప్రాంతీయ రవాణా అధికారి, జిల్లా ఉద్యాన అధికారి జమదగ్ని, మార్కెటింగ్ ఏడి బి.రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును తవ్వేస్తే సహించేది లేదు

అడ్డుకున్న చీడిపాలెం గిరిజనులు
వెనుదిరిగిన రియల్ ఎస్టేట్‌దారులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గిరిజనులు అడ్డుకోవడంతో నిలిపివేసిన పనులు




మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ చినఖండేపల్లి నుంచి చీడిపాలెం వెళ్లేదారిని ఒక లేఆవుట్ యాజమాన్యం తవ్వేయడంతో రాకపోకలు ఆగిపోయాయి. శుక్రవారం పాఠశాల పిల్లలను తీసుకెళ్తున్న ఆటో నిలిచిపోవడంతో ఆ గ్రామ గిరిజనులు అక్కడికి చేరుకొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ భూములు కొన్న కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమిలో ఈ రోడ్డువుందని ఎవ్వరికి చెప్పకుండా ఏకంగా రోడ్డును తవ్వేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిధులతో గడిచిన 40 ఏళ్లలో 7సార్లు ప్రజాదనంతో ఈరోడ్డును వేశారని, ప్రస్తుతం ఈ రోడ్డును మెటల్ రోడ్డుగా గ్రామస్థులు వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రజలు తిరుగుతున్న రోడ్డును యదేచ్ఛగా ఎలా తవ్వుతారని ప్రశ్నించారు. ఆ సమయంలో గ్రామపెద్దలు చేరుకోవడంతో వెనక్కి తగ్గిన లే అవుట్ సూపర్‌వైజర్లు పని ఆపి తిరిగి యాధాతథంగా రోడ్డువేస్తామని చెప్పడంతో గిరిజనులు శాంతించారు. ఈవిషయంపై లేవుట్ ప్రతినిధులు మాట్లాడుతూ అది తమ జిరాయితీస్థలమని, ప్రభుత్వం రోడ్డు వేసినప్పుడు తమకు తెలియదని చెప్పారు. గ్రామస్తుల కోసం వేరే రోడ్డు వేస్తామని తెలిపారు. విఆర్ఒ గణపతి వచ్చి పరిశీలనచేశారు. గిరిజనులు ఆందోళన చేస్తున్న విషయం తెలియడంతో ఆక్కడకు పోలీసులు చేరుకున్నారు ఈరోడ్డు తవ్వకం విషయంపై గంట్యాడ తహాశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి వివరణ కోరగా ఈవిషయంపై పూర్తిస్థాయి పరిశీలనచేసి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

సముద్ర తీరంలో తాబేళ్ల సందడి

- సుమారు 5వేల పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టిన సంస్థ
- ఇప్పటివరకు 56వేల గుడ్లు సేకరణ
- రెండు మండలాల్లో 10 సంరక్షణ కేంద్రాలు

ప్రజాశక్తి - భోగాపురం



సముద్రంలో తాబేళ్ల పిల్లలను విడిచిపెడుతున్న ట్రీ ఇండియా నిర్వాహకులు

సముద్ర తీరంలో తాబేళ్ల పిల్లలు సందడి చేస్తున్నాయి. గుడ్లు పొదిగి పిల్లలు వస్తుండడంతో వాటిని ట్రీ ఇండియా స్వచ్ఛంద సంస్థ సిబ్బంది తీరంలో వదులుతున్నారు. వందలాది పిల్లలు ఒడ్డు నుంచి సముద్రంలోకి బుజ్జి బుజ్జి అడుగులు వేసుకుంటు వెళ్తున్నాయి. జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఏటా జనవరి నెల నుంచి పెద్ద పెద్ద తాబేళ్లు వందల సంఖ్యలో గుడ్లు పెట్టేందుకు తీరానికి వస్తుంటాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో గుడ్లు పెట్టేందుకు వచ్చిన తాబేళ్ళు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. తీరానికి వచ్చి ఇసుకలో పెట్టిన గుడ్లను తీరం ఒడ్డున ఉన్న అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్రాల్లో స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఇసుక లోపల గుడ్లను ఉంచుతారు. రెండు మండలాల పరిధిలో చేపల కంచెరు, చోడిపిల్లిపేట, ముక్కాం, కోనాడ, తిప్పలవలస, బర్రిపేట, చింతపల్లి, పులిగెడ్డ ఇలా పది చోట్ల తీరప్రాంత గ్రామాల్లో సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు వేసి గుడ్లను భద్రపరిచారు. ఈ రెండు మండలాల పరిధిలో సుమారు 56వేలు పైనే గుడ్లను స్వచ్ఛంద సంస్థ సభ్యులు సేకరించారు.

రెండు వారాలుగా సముద్రంలోకి..

గత 15 రోజుల నుంచి తాబేళ్ల పిల్లలను స్వచ్ఛంద సంస్థ సభ్యులు సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. ఈ సంరక్షణ కేంద్రాల్లో భద్రపరిచిన గుడ్లు గత రెండు వారాలుగా పొదిగి పిల్లలు వస్తున్నాయి. బయట చల్లదనం ఉంటేనే ఆ సమయంలో ఇవి బయటకు వస్తుంటాయి. అంటే ప్రతిరోజు ఉదయం నాలుగు నుంచి ఐదు గంటల ప్రాంతంలో, రాత్రి ఎనిమిది నుంచి తొమ్మిది గంటల ప్రాంతంలో పిల్లలు బయటకు వస్తున్నాయి. బయటికి వచ్చిన పిల్లలను స్వచ్ఛంద సంస్థ సభ్యులు సేకరించి వాటిని సముద్ర తీరం ఒడ్డున వదులుతారు. అవి నడుచుకుంటూ బుజ్జి బుజ్జి అడుగులు వేసుకొని సముద్రంలోకి వెళ్తుంటాయి. మే నెల ఆఖరి వరకు గుడ్లు పొదిగి పిల్లలు వస్తుంటాయని కంచెరు తీరంలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు వాసుపల్లి రాము, నర్సింగరావు తెలిపారు.

రెండు మండలాల్లో 56వేలు గుడ్లు సేకరించాం

భోగాపురం, పూసపాటిరేగ తీర ప్రాంత గ్రామాల్లో తాబేళ్ల గుడ్లను సంరక్షించేందుకు పది సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు 56 వేలు గుడ్లను సేకరించాం. సుమారు 5వేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టాం. మే నెలాఖరి వరకు గుడ్లు పొదుగుతాయి. ప్రతిరోజు పొదిగిన పిల్లలను సముద్రంలోకి విడిచి పెడుతుంటాం.

బర్రె కామయ్య,
ట్రీ ఇండియా సంస్థ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్



సముద్రంలోకి వెళ్తున్న తాబేళ్ల పిల్లలు

అవిశ్వాస తీర్మాన సంతకాలపై దర్యాప్తు

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణపై వైసిపి అసమ్మతి, టిడిపి కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంపై పెట్టిన సంతకాలు దర్యాప్తు చేసేందుకు చర్యలు చేపట్టారు. చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు 20మంది కౌన్సిలర్ల సంతకాలతో లేఖను జిల్లా కలెక్టర్ అంబేద్కర్‌కు మూడు రోజుల క్రితం అందజేశారు. దీంతో అవిశ్వాస తీర్మానంపై ఉన్న సంతకాలు కౌన్సిలర్లు పెట్టారా లేదా అని దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మిను ఆర్‌డిఒ రామ్మోహనరావు ఆదేశించడంతో సంతకాలపై కమిషనర్ దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు పూర్తి అయిన వెంటనే నివేదిక ఆర్‌డిఒకు అందజేస్తామని కమిషనర్ చెప్పారు.

రాష్ట్ర హైవే రోడ్లకు రూ.9కోట్లు మంజూరు

ప్రజాశక్తి - బొబ్బిలి

రాష్ట్ర హైవే రోడ్లు పాడైపోవడంతో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.9కోట్లు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే బేబినాయన ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి నియోజకవర్గంలో రెండు రోడ్లకు ప్రభుత్వం నిధులు మంజూరైనట్లు చెప్పారు. రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఎన్నికల హామీలను అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కుమిలి ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య శిక్షణ పొందుతున్న విద్యార్థులు 12 రోజులు పాటు ఇంటర్న్‌షిప్ శిక్షణకు మండలంలోని రెల్లివలస పిహెచ్‌సికి పంపుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని రెల్లివలస పిహెచ్‌సిలో శుక్రవారం విద్యార్థులు శిక్షణ పొందారు. ఒకేషనల్ టీచర్ సూరికుమారి విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

కంటి రోగులకు తనిఖీలు

ప్రజాశక్తి - వంగర

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి జ్యోతి పర్యవేక్షణలో ఆప్తాల్మిక్ అధికారి ఎస్.వసంతకుమార్ జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 43 మంది కంటి రోగులకు తనిఖీలు చేశారు. ఇందులో పది మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ కంటి రోగాల పట్ల నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితులు పార్వతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీరు లేక ఇబ్బందులు

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని ఆదవరం సాయన్న గెడ్డ మూడు షట్టర్లు పూర్తిగా పాడైపోయినందున సుమారు 250 ఎకరాలు పంట పొలాలకు సాగునీరు అందక రైతులు పంటలు పండించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు శుక్రవారం వాపోయారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ కాలువకు తలుపులు లేక ఏటానికి మూడు పంటలు పండించే రైతులు పంటలు పండించలేక పోతున్నామన్నారు. పాలకులు, అధికారులు పరిశీలన జరిపి షట్టర్లు మంజూరు చేయాలని సర్పంచ్ మొయ్య ఈశ్వరమ్మ, రైతులు బాలి రామకృష్ణ, కర్ని అప్పలనాయుడు, లోచర్ల గణపతిరావు, కర్నెన సింహచలం కోరారు. షట్టర్లు మంజూరు చేయకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - డెంకాడ

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. మండలంలో విజయ నగరం నుంచి నాతవలస, నాతవలసి నుంచి భోగాపురం జాతీయ రహదారి, విజయనగరం నుంచి విశాఖపట్నం వెళ్ళు జాతీయ రహదారి గ్రామాలను కలుపుతూ ఉన్న రోడ్లలో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈనేపథ్యంలో జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజనీరింగ్ కళాశాల 17 స్టాపర్ బోర్డులను ఏర్పాటు చేసిందన్నారు. వీటిని భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో చింతలవలస 5వ బెటాలియన్ మెయిన్ రోడ్‌లో ఇండియా జంక్షన్ జొన్నాడ పైడితల్లి అమ్మవారి గుడి వద్ద, లెండి కాలేజ్ వద్ద ఉన్న రోడ్లలో ఈ స్టాపర్స్ బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. ఆర్అండ్‌బి జెఇతో కలిసి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల బ్లాక్ స్పాట్‌లను గుర్తించామన్నారు.



స్టాపర్లను ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ, సిఐలు

నేడు 'గురువందనం'

ప్రజాశక్తి - విజయనగరం

వాయులీన విద్యాప్రవీణ, సంగీత విద్యానిధి సద్గురు ద్వారం దుర్గాప్రసాదరా వుకు గురువందన కార్యక్రమాన్ని ఈ నెల 5న స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళా శాల ఆవరణలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసారు. ఈమేరకు శిష్యప్రశిష్య సమాఖ్య వైస్ చైర్మను సిహెచ్.రాజ్యలక్ష్మి, పి.త్రినాధరావు తెలి పారు. ఈ సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత ద్వారం దుర్గాప్రసాదరావును ఘనంగా సత్కరించనున్నారు. అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి, కట్టమూరి చంద్రశేఖరం, కవిరాయని ఎవిఎల్ఎన్. శాస్త్రి, చాగంటి కొండలరావు హాజరు కానున్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొనున్నార. కార్య క్రమాన్ని ప్రొగ్రాం కన్వీనర్ ఎం. నీలాద్రిరావు, కోశాధికారి ఎమ్. ధనలక్ష్మి, సభ్యులు కె. విజయలక్ష్మి, సుధారాణి, ఎంవి కామేశ్వరరావు, తదితరులు పర్యవేక్షిస్తున్నారు.


బహుమతులను అందుకుంటున్న విద్యార్థినులు

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 21వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. రామయ్య ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఎయు డీన్ అకడమిక్ ఎఫైర్స్ ప్రొఫెసర్ కె.ఈశ్వర్‌కుమార్, గౌరవ అతిథిగా పైడిభీమవరంలోని ఎపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ఆర్ హెడ్ కమలాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకునేందుకు ఫార్మా రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. మాన్సాస్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ కెవిఎల్ రాజు మాట్లాడుతూ సమాజంలో డాక్టర్లు, రోగుల మధ్య వారధిగా ఫార్మసిస్టులు ఉండాలని, ఫార్మసీ రంగం భారతదేశ ఆర్థికవ్యవస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది అని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాలలో నిర్వహించిన వివిధపోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత అంశాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యతాంశాలను శతశాతం అమలు చేసి పురపాలనలో మెరుగైన ఫలితాలను తీసుకురావాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ పల్లి నల్లనయ్య, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ముఖ్యంగా నగరంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని సురేష్ కుమార్ ఆదేశించారు. ముందస్తుగానే నీటి పంపిణీకి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకుని, అమలు చేయాలన్నారు. అన్నా క్యాంటీన్ల ఔన్నత్యాన్ని మరింత పెంచాలని చెప్పారు. శతశాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగే విధంగా చూడాలన్నారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలముల పన్నులు, వాటర్ చార్జీలను వసూలు చేసి లక్ష్యాలను అధిగమించాలని చెప్పారు.

మూడు అన్న క్యాంటీన్లు భేష్

- అత్యుత్తమ 15 క్యాంటీన్లలో మూడింటికి చోటు
- రాష్ట్రస్థాయిలో జిల్లాకు గుర్తింపు
- నిర్వహణ పట్ల 98 శాతం మంది సంతృప్తి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అనునిత్యం పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లకు చక్కని గుర్తింపు లభించింది. జిల్లాకు చెందిన మూడు అన్న క్యాంటీన్లకు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు దక్కాయి. ఈ మూడు క్యాంటీన్ల నిర్వహణ పట్లా ప్రజల నుంచి 98 శాతానికి పైగా సంతృప్తి వ్యక్తం చేసినట్లు ప్రభుత్వం నిర్వహించిన అభిప్రాయ సేకరణలో అభిప్రాయం వ్యక్తమైంది. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన క్యూఆర్ కోడ్ ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లాకు చెందిన మూడు అన్న క్యాంటీన్లు మెరుగైన ర్యాంకులను సాధించాయి. బొబ్బిలి ఆర్అండ్‌బి ఆఫీసు సమీపంలోని అన్న క్యాంటీన్‌కు రాష్ట్రస్థాయిలో ఐదో స్థానం, విజయనగరం ప్రకాశం పార్కులోని క్యాంటీన్‌కు ఏడో స్థానం, ఘోషా ఆసుపత్రిలోని అన్న క్యాంటిన్‌కు పదో స్థానం దక్కాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 205 అన్న క్యాంటీన్లలో కేవలం 15 క్యాంటీన్లకు మాత్రమే మెరుగైన ర్యాంకులు దక్కగా, వాటిలో జిల్లాకు చెందిన మూడు క్యాంటీన్లకు పదిలోపు స్థానాలు దక్కడం విశేషం. బొబ్బిలి అన్న క్యాంటీన్ నిర్వహణ విషయంలో మొత్తం 2034 మంది క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను చెప్పగా, వీరిలో 1995 మంది (98 శాతం) సానుకూలంగా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశాలకు అనుగుణంగా, ఎప్పటికప్పుడు క్యాంటీన్ల నిర్వహణను మెరుగు పరుస్తుండటంతో, జిల్లాకు ఈ అరుదైన గౌరవం దక్కింది.



ర్యాంకు సాధించిన ప్రకాశం పార్కు వద్ద అన్న క్యాంటీన్

మరింత మెరుగ్గా నిర్వహణ : కలెక్టర్

జిల్లాలోని మూడు అన్న క్యాంటీన్లకు రాష్ట్రస్థాయిలో మెరుగైన ర్యాంకులు లభించడం పట్ల అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అభినందించారు. వీటి నిర్వహణను మరింతగా మెరుగుపరిచి, ప్రజలకు రుచికరంగా, నాణ్యమైన భోజనాన్ని, అల్పాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని అన్ని అన్న క్యాంటీన్ల నిర్వహణలో ఒకదానితో ఒకటి పోటీపడి, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను సాధించాలని కలెక్టర్ కోరారు.

ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు అవసరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మహిళల ఆర్థికాభివృద్ధిపై ప్రణాళికలు అవసరమని ఎపిఎం ఎస్‌విడి సురేష్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం వెలుగు విఒఎలు, ఎన్యూమరేటర్లకు మండలస్థాయిలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో వార్షిక రుణం, జీవనోపాధుల ప్రణాళికల పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధి, జీవనోపాదులు కల్పన, వార్షిక రుణం ప్రణాళికల తయారీ పై దృష్టి పెట్టాలన్నారు. శిక్షణ అనంతరం డ్వాక్రా సంఘాలకు ప్రణాళికలపై అవగాహన కల్పించి ఈ నెల 7 నుంచి చిన్న సంఘాల వివరాలు వారి అప్పులు, నిల్వ అప్పులు, ఎంత తీసుకున్నారు, దేనికి ఖర్చు చేసారో మొబైల్ యాప్ ద్వారా సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిజి ఎపిఎం ఎల్.పద్మ, సిసిలు, విఒఎ, ఎన్యూమరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మహిళా సంఘాల సభ్యులు రుణాలు, జీవనోపాధికి సంభందించిన ప్రణాళిక తయారీపై విఒఎలకు, ఎన్యుమరేటర్లకు మూడు రోజులపాటు శిక్షణ ఇచ్చామన్నారు. 210 మందికి 4 బ్యాచ్‌ల్లో శిక్షణ పూర్తి చేశామన్నారు. ఇప్పటి వరకు మహిళలు తీసుకున్న రుణాలు వారి అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే కాలంలో వారు చేస్తున్న జీవనోపాధి కార్యక్రమం ఏవిదంగా ఉంటుందో, వారికి ఎటువంటి ఆర్థిక సహకారం కావాలో గుర్తించామన్నారు. ఈ విషయాలపై ఎనిమిది స్వయం సంఘాలకు గాను ఒక ఎన్యుమరేటర్ను నియమించామన్నారు. ఆయా సంఘాల మహిళలకు జీవనోపాధి కార్యక్రమాలకు, చదువుకు, గృహ, ఇతర అవసరాలకు కావలసిన రుణాల వివరాలు ఏవిధంగా ప్లాన్ చేయాల్సి వుందో అన్న విషయాలు పై ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం రమణతో పాటు సిసిలు కోటరావు, మంగమ్మ, విఒఎలు పాల్గొన్నారు.


రేగిడి: మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవి

రేగిడి: గ్రామస్థాయి మహిళా స్వయం శక్తి సంఘాల స్వావలంబనకు నూతన రుణ ప్రణాళికలు ఎంతో అవసరమని రాజాం ఏరియా కోఆర్డినేటర్ ఏ. చిరంజీవి అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఆదేశాల మేరకు సీసీలు, ఎన్యుమరేటర్లు, ఎంఎంఎస్ కార్యనిర్వాహక సభ్యులతో శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా స్వయం శక్తి సంఘ సభ్యులందరికీ వార్షిక జీవనోపాదుల ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన మహిళా సంఘాలు ఆర్థిక బలోపేతానికి ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. యాప్‌లో నమోదు చేయించాలని తెలిపారు. ప్రతి మహిళా సంఘ సభ్యులు ఆర్థిక పరిపుష్టికి రుణాలు ఎంతో దోహద పడతాయన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ బాసిన గోవిందరావు ఉన్నారు.

స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు

ప్రజాశక్తి- బొబ్బిలి

తమ ఇంటికి స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, కరెంటు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ శుక్రవారం సిపిఎం నాయకులు బొబ్బిలి 30వ వార్డులో ఇంటింటికీ స్టిక్కర్లును అతికించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. శంకరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం అదానితో చేసుకున్న సెకి ఒప్పందంలో 25 సంవత్సరాలు కరెంటు ఛార్జీలు పెరగడం, స్మార్ట్ మీటర్లు ప్రమాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన టిడిపి కూటమి ప్రభుత్వం అదే ఒప్పందాన్ని ఇప్పుడు అమలు చేస్తుందని అన్నారు. ప్రజలందరూ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని కరెంటు చార్జీలు తగ్గించే విధంగా ప్రజలు పోరాటాల్లోకి రావాలని పిలుపు ఇచ్చారు. గత ప్రభుత్వం అదానితో చేసుకున్న సెకి ఒప్పందం వల్ల ప్రజలపై లక్ష కోట్లకు పైగా కరెంటు ఛార్జీల భారం పడుతుందని అన్నారు. మన రాష్ట్రంలో పరస్పరం కత్తులు దూసుకుంటున్న టిడిపి వైసిపి పార్టీలు అదానీని రక్షించే పనిలో ఉన్నాయన్నారు. కరెంటు ఛార్జీల భారంపై ప్రజలు చైతన్యవంతులై పెరుగుతున్న ఛార్జీలను అడ్డుకోవడానికి సిద్ధపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ గోపాల్, బి.యుగంధర్, జి.గౌరీ ప్రజలు పాల్గొన్నారు.

వీధుల్లో సిపిఎం ప్రచారం


ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ఏడాదైనా తాగునీరివ్వరా?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో ఇంటింటికీ తాగునీరందించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం కుళాయిలను ఏర్పాటు చేసింది. అయితే ఏడాది పూర్తి కావస్తున్నా ఇంత వరకూ ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటిని ఇవ్వలేదు. దీంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు మండల, జిల్లా స్థాయిలో ఎంపిటిసి గొంప తులసీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. కేవలం గ్రామ సర్పంచ్ వైసిపి గొంప వారి వీధికి తాగునీటిని అందించడానికి ముందుకు రావడం లేదని ఆమె ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి గొంప వారి వీధికి తాగునీటి సౌకర్యం కల్పించాలని లేని పక్షంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళతామని ఆ వీధి మహిళలు హెచ్చరిస్తున్నారు.


నిరుపయోగంగా ఉన్న కుళాయి

అధికారుల దృష్టిలో పెట్టాం

ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం. ప్రస్తుతం నిధులు నిలుపుదల చేయడం వల్ల పనులు పూర్తి కాలేదు. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాం

వి. దేవి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి వేపాడ

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుర్ల

రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. దమరసింగి గ్రామం నుండి సతివాడ వరకు రూ.1.50కోట్లతో నూతనంగా నిర్మించిన రోడ్డును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారు అని అన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతోందని అన్నారు. గత వైసిపి హయాంలో నిర్లక్ష్య ధోరణితో ఈ రాష్ట్రంలో గుంతల రోడ్లతో ప్రజలు నరకాన్ని చూశారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా రూ.861 కోట్ల నిధులతో గుంతల రోడ్ల మరమ్మత్తుల కార్యక్రమం చేపట్టారన్నారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణాల్లో అంతర్గత బీటీ, సీసీ రోడ్లకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, టిడిపి మండల అధ్యక్షులు చనమల మహేష్, జిల్లా కార్యదర్శి కిరణ్ కుమార్ రాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు శివప్రసాద్, నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి మండల అప్పలనాయుడు, తదితర నాయకులు పాల్గొన్నారు.


రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

వాత్సల్య సమావేశాలు

విజయనగరం టౌన్: పిల్లల సంక్షేమం, రక్షణ, సమగ్ర అభివృద్ధి మిషన్ వాత్సల్య లక్ష్యంగా సచివాలయాల పరిధిలో మిషన్ వాత్సల్య సమావేశాలు శుక్రవారం జరిగాయి. స్థానికులతో నిర్వహించిన సమావేశంలో మిషన్ వాత్సల్య ఉద్దేశాన్ని, ఆవశ్యకతలను సచివాలయ కార్యదర్శులు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ హానికర పరిస్థితుల్లో ఉన్న పిల్లలకు భరోసా కల్పించే లక్ష్యంతో మిషన్ వాత్సల్య పనిచేస్తు ందని తెఇపారు. పిల్లల హక్కులను కాపా డడం, దుర్బల పిల్లలకు సంపూర్ణ సంరక్షణ అందించడంపై దృష్టి సారిస్తుందన్నారు. ఒకటి నుండి 18 ఏళ్ల వయసు గల పిల్లలకు మిషన్ వాత్సల్య ఉపయుక్తంగా ఉంటుంద న్నారు.

చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని పలు పంచాయతీల్లో వున్న చెరువుల్లో జోరుగా మట్టిమాఫీయ చెలరేగు తుంది. పోతనాపల్లి గ్రామం వద్ద రోడ్డుకు వందమీటర్ల దూరంలో వున్న కృష్ణంరాజు చెరువులో ప్రతిరోజు పెద్దఎత్తున మట్టి తవ్వకాలు జరుగు తున్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన అధికారులు ఎందుకు మౌనంగా వున్నారో వారికే తెలియాలి. అధికారులు చూసీచూ డనట్లు వదిలేయడంతో మట్టి మాఫియా చెలరేగుతూ రియల్ ఎస్టేట్ వేసే లే అవుట్ల స్థలాలు కప్పేందుకు, ఇటుకుల బట్టీలు ఇతర అవసరాలు వున్నవారికి పెద్దఎత్తున అమ్మకం చేసుకుంటున్నారు. మండలంలోని కృష్ణాపురం, శివరామరాజుపేట, బొడ్డవర పంచాయతీల్లో వున్న చెరువుల్లో మట్టిని విచ్చలవిడిగా తవ్వేసుకుంటున్నారు. చెరువులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఇరిగేషన్ శాఖ మాత్రం కనీసం వీటిపై దృష్టి ఎందుకు పెట్టడం లేదో అని ప్రతి ఒక్కరు అనుకుంటున్నారు. ఈ తవ్వకం విషయంపై ఇరిగేషన్ ఎఇ శివరామకృష్ణ వద్ద ప్రస్తావించగా తాను చెరువులను ఇక నుంచి పర్యవేక్షిస్తామని తవ్వకాలు జరిగితే సంబందిత ఆదికారులతో చర్చించి అడ్డుకుంటామని తెలిపారు.


జెసిబితో మట్టిని తవ్వి తరలిస్తున్న అక్రమార్కులు

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఎంపిపి తాడ్డి కృష్ణవేణి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపిడిఒ జి. భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారని, మండలం స్థాయిలో అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తి సమాచారంతో రావాలని కోరారు. మండలంలోని వైస్ ఎంపిపిలు, అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు సకాంలో హాజరుకావాలన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం, కొత్తబొద్దాం, పాటూరు పాఠశాలలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. పాటశాల పరిసరాలు, తరగతి గదులు, టాయిలెట్స్, వంటగది, డ్రింకింగ్ వాటర్ సిస్టమ్, కిచెన్ గార్డెన్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్, చదివించడం, రాయించడం చతుర్విధ ప్రక్రియలు చేయించడం టేబుల్స్ చదివించడం వర్క్ బుక్స్ మొదలగునవి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం చేశారు.


విద్యార్థులకు పుస్తకాలు ఇస్తున్న ప్రిన్సిపాల్

పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం పుస్తకాల పంపిణీ చేశారు. కళాశాలలో 2025-2026 సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ చేతులు మీదుగా పుస్తకాలను అందించారు. టెక్స్ట్ బుక్స్, 12 నోట్ బుక్స్ ప్రభుత్వం ఉచితంగా ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం కలిపిస్తున్న సౌకర్యం వినియోగించుకొని కష్టపడి చదివి కళాశాలకు, తలిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

ఎస్.కోటలో మోస్తరు వర్షం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్‌కోట పట్టణంలో శుక్రవారం ఉరుములు మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటలు సమయం దాటిన తర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వెంటనే ఉరుములు మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురవడంతో పట్టణ ప్రజలకు కాసంత ఉపశమనం లభించింది. ఇది ఎలా ఉండగా చాలా నెలలుగా మురుగు నీటితో నిండి ఉన్న మురుగు కాలువలు వీధుల రోడ్లపై పొంగి పొర్లాయి. వీధుల్లో రోడ్లను దుర్గంధం చేశాయి. సైడు కాలువలపై పలకలు వేసి కప్పి వేయడంతోనే చెత్తాచెదారం చిక్కుకొని మురుగునీరు ఇలా రోడ్లపైకి వస్తుందని పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

కేన్సర్ రోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన పప్పల సూర్యనారాయణ (46) అనే కేన్సర్ రోగికి మండల జనసేన నేతలు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదేశాలు మేరకు శుక్రవారం ఆయనను పరామర్శించి రూ. 40 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పప్పల సూర్యనారాయణకు నాలుకకు కేన్సర్ వచ్చిందని, చికిత్స నిమిత్తం సుమారు రూ.10 లక్షలు వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. పేద కుటుంబం కావడంతో ఆర్థిక సమస్యతో సతమతమవుతున్నారని జనసేన నేత, కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు తెలుసుకుని విషయాన్ని నెల్లిమర్ల ఎమ్మెల్యేకు వివరించారన్నారు. వెంటనే స్పందించిన ఆమె కార్యకర్తలంతా కలిసి రోగికి సహకారం చేయాలని సూచించడంతో ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. రోగి చికిత్సకు అండగా ఎమ్మెల్యే సహకారం ఉంటుందని కుటుంబీకులకు వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నేతలు కోట్ల రఘు, పత్తిపాటి శ్రీను, రౌతు శ్రీరామ్మూర్తి, గణేష్, శంకబత్తుల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయాన్ని అందిస్తున్న జనసేన నాయకులు

ఉచిత వైద్య శిబిరంతో ఉపయోగం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సామాన్య మధ్య తరగతి వర్గాల వారికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనక మహాలక్ష్మి పుట్టినరోజును పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని దాసన్నపేటలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్ర సమస్యలు ఉన్నవారు వైద్య శిబిరాన్ని వినియోగించుకొని కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి కేటరాక్టు శస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా నగరంలోని స్వామి కంటి ఆసుపత్రిలో నిర్వహిస్తారని తెలిపారు. కనకమహాలక్ష్మి మాట్లాడుతూ పేదలకు ఉపయోగపడేలా వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ మురళి మాట్లాడుతూ 50 సంవత్సరాలు వయసు దాటిన వారంతా తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా షుగరు ఉన్నవారు ఎక్కువగా గ్లోకోమా వ్యాధి బారిన పడే అవకాశం ఉన్నందున ప్రతి మూడు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పిల్లా విజయకుమార్, కొర్నాన రాజ్యలక్ష్మి, తిరుమల ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ జ్యోతి, స్వామి ఆసుపత్రి ఎఒ బాబ్జీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

నేరాలు ఘోరాలు

క్వారీపై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తి క్వారీ వద్ద రోజువారీ కూలి పని చేసుకుని జీవిస్తున్న చింతల సత్తిబాబు (54) శుక్రవారం క్వారీ వద్ద కాలు జారి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. వెంటనే గుర్తించిన తోటి కూలీలు మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్తిబాబు మృతి చెందినట్లు ఆయన కుమారుడు చింతల రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్ఐ బి.దేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన వ్యక్తి అనకాపల్లి జిల్లా, నాతవరం మండలం, చర్లపాలెం గ్రామానికి చెందిన వాడిగా గుర్తించామన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - గజపతినగరం

పురుగు మందు తాగి మండలంలోని మధుపాడ ప్రాంతం ఒక తోటలో రామభద్రపురం గ్రామానికి చెందిన కురుంబిల్లి శ్రీనివాసరావు (36) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని కాలంరాజుపేట గ్రామానికి చెందిన ఈశ్వరితో 14 సంవత్సరాల క్రితం పెళ్లి జరిగిందని, రామభద్రపురంలో టైల్స్ వ్యాపారం చేసేవాడని ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుండెపోటుతో గీత కార్మికుడు మృతి

ప్రజాశక్తి - గజపతినగరం

గుండెపోటుతో కల్లుగీత కార్మికుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో ఎం.కొత్తవలసలో చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన భోగాది సత్యం(46) రోజువారి వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి కళ్ళు గీసిన అనంతరం కొంచెం ఆయాసం రావడంతో అదే చెట్టు నీడన కూర్చుని గుండెపోటుతో చనిపోయాడని ఎస్ఐ కె.లక్షణరావు తెలిపారు. మృతుని భార్య బోగాది లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

10న ఉచిత లివర్ స్కాన్ పరీక్షలు

బొబ్బిలి: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 5వేల రూపాయలు విలువచేసే లివర్ ఫై బ్రో స్కాన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు రోటరీ జిల్లా చైర్మన్, క్లబ్ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్, జెసి రాజు తెలిపారు. ఇందుకు సంబంధించి శుక్రవారం డిఎస్‌పి భవ్య రెడ్డి చేతులు మీదుగా కరపత్రాలను ఆమె తన కార్యాలయంలో విడుదల చేశారు. ఉచిత లివర్ పరీక్షలు ఈ నెల 10వ తేదీన ఉదయం 9.30 గంటల నుండి స్థానిక ఎన్అర్ఐ హాస్పిటల్‌లో నిర్వహిస్తామని అన్నారు. టైప్ టు మధుమేహం, ఊబకాయం, అధిక ట్రైగ్లిజరైడ్స్, మెటాలిక్ సిండ్రోమ్, అధిక కొలెస్ట్రాల్, మద్యం సేవించే వారు, థైరాయిడ్ ఉన్నవారు తప్పనిసరిగా ఈ లివర్ ఫైబ్రో టెస్టులు చేయించుకోవాలన్నారు. ఈ టెస్ట్ చేయించుకొనే వారు 3 గంటలు ముందు ఏమి తినకూడదని తెలిపారు. లివర్ సమస్యలు ఉన్నవారికి డాక్టర్ ఎన్ఎల్ అభినయ్ చికిత్స అందిస్తారని తెలిపారు. వీరితో పాటు శ్రీహరి, రామకృష్ణలు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి, తదితరులు